
సాక్షి
కుమురం భీం

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



ఇక మూడో యూనిట్..
ఎట్టకేలకు మూడో యూనిట్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు మోక్షం కలగనుంది. రూ.9,500 కోట్లతో ప్లాంట్ నిర్మించనుండగా తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. 8లో▸



'కంది' ఆశలపై నీళ్లు
పత్తిలో అంతరపంటగా కంది సాగు చేసిన రైతులకు ఏ పంటా కలిసి రాలేదు. వానలు లేక పత్తి, పూత రాలి కంది దిగుబడి తగ్గనుండటంతో దిగులు చెందుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /20.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. జిల్లాలో మోస్తరు, కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన జిల్లా నేతలు



సీఎం రేవంత్‌రెడ్డితో శ్యాం, నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంగా గుండా శ్యాం, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డితో సీఎంను కలిశారు. మరింత ఉత్సాహంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు శ్యాం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు కమలనాథ్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన సక్కు



సీతక్కను శాలువాతో సన్మానిస్తున్న సక్కు

ఆసిఫాబాద్: ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావుతో శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సిద్ధార్థరాజ్

రెబ్బెన: ఈనెల 6నుంచి 8వరకు కర్ణాటకలోని కొడుగు జిల్లా కుశల్‌నగర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ కప్ పోటీలకు గోలేటికి చెందిన కే సిద్ధార్థరాజ్ ఎంపికైనట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సిద్ధార్థరాజ్ గతంలో శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని అసోషియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, పీఈటీ భాస్కర్ తదితరులు అభినందించారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఐఈవో కళ్యాణితో కలిసి జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వార్షిక పరీక్షా ఫలితాల్లో జిల్లాను ముందుంచాలని సూచించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచి క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్షిక పరీక్షలు 80 రోజులే ఉండటంతో విద్యార్థులను సన్నద్ధం చేయాలని తెలిపారు. నషా ముక్త్ భారత్ కింద కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సీతారాం తదితరులున్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు

ఆసిఫాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 19వ తేదీ నుంచి జిల్లాలో సాంస్కృతిక సారథి కళాకారులతో ప్రజాపాలన, ప్రజావిజయోత్సవాలు జిల్లాలోని 57 గ్రామాల్లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఉద్యోగాల కల్పన, యువవికాసం, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ముమ్మర ప్రచారం చేపట్టనున్నట్లు వివరించారు.

ఇందిరమ్మకు శ్రీకారం

- నెరవేరబోతున్న సొంతింటి కల
- అర్హుల ఎంపికకు ప్రత్యేకయాప్
- గూడు లేని నిరుపేదలకు వరం
- జిల్లాలో 1,54,136 దరఖాస్తులు



ఆసిఫాబాద్: ఇందిరమ్మ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. ఎన్నికల మేనిఫెస్టో అమలులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 5వ తేదీన ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో దరఖాస్తుదారుల్లో సొంతింటిపై ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోంది. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ సౌకర్యం కల్పిస్తోంది. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీంతో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కల సాకారం కానుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందుగా ఇంటి స్థలం ఉన్న వారికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. ఒక్కో లబ్ధిదారుకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వనుంది. నిర్మాణ దశలను అనుసరించి నాలుగు దఫాల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనుంది.

జిల్లాకు 7వేల ఇళ్ల కేటాయింపు

ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 335 పంచాయతీల పరిధిలో వివిధ పథకాల కోసం 1,63,647 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,54,136 అర్జీలు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో సొంత స్థలమున్న నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులు, దళితులు, పారిశుధ్య కార్మికులు, వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ముందుగా ఇళ్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. లబ్ధిదారులు తమకున్న స్థలాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని ఇళ్లు నిర్మించుకునేలా ప్రతీ మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించనున్నారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున జిల్లాకు 7వేలు ఇళ్లు మంజూరయ్యాయి. వీటితోపాటు ఏజెన్సీలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అదనంగా మరిన్ని మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

ముందుకు సాగని 'డబుల్'

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాకు 1,223 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. కొన్ని మండలాల్లో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 480 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయగా, వీటిలో 288 మాత్రమే పూర్తి చేశారు. వీటి కోసం 5వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. లక్కీ డీప్ పద్ధతిలో అర్హులను ఎంపిక చేశారు. కాగా, లబిబ్ధదారుల ఎంపికలో పారదర్శకత లేదని కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచింది.

యాప్‌లో నమోదు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇందిరమ్మ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తుదారు పేరు, ఆధార్ నంబర్, సంవత్సరాదాయం, సొంత స్థలం ఉందా/లేదా, ఇప్పటి వరకు ఇందిరమ్మ పథకం కింద లబ్ధిపొందారా.. ఇలాంటి 35 రకాల ప్రశ్నలకు సమాధానాలు యాప్‌లో ఎంట్రీ చేయాలి. దరఖాస్తుదారులకు ఫోన్ లేని పక్షంలో అధికారులు ఇంటికి వచ్చినపుడు వివరాలు తెలుపాలి. యాప్‌లో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి దరఖాస్తుదారు ముఖం, ఇల్లు నిర్మించే స్థలానికి భౌగోళిక అక్షాంశాలు, రేఖాంశాల వివరాలు నమోదు చేస్తారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని కూడా ఎప్పటిప్పుడు ఏఐ ఆధారంగా ఫొటోలు తీస్తారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఈ నెల 10వ తేదీ వరకు మున్సిపాలిటీల్లో ముఖ్య ప్రణాళిక అధికారుల ఆధ్వర్యంలో, గ్రామపంచాయతీల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగి, ఆస్తి పన్ను చెల్లింపుదారు, మూడు, నాలుగు చక్రాల వాహనాలున్నవారు, గతంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిపొందిన వారు పథకానికి అనర్హులని ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసింది.

విద్యావ్యవస్థను పటిష్టం చేస్తాం



వాంకిడి: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వెంకటేశ్

- విద్యాకమిషన్ సభ్యుడు వెంకటేశ్
- పలు పాఠశాలల సందర్శన

ఆసిఫాబాద్‌అర్బన్: గత పదేళ్లలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా విద్యాకమిషన్ ప్రత్యేక దృష్టి సారిస్తోందని రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'విద్యావ్యవస్థ బలోపేతం–మౌలిక వసతుల కల్పన'పై విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలలను సందర్శించినట్లు చెప్పారు. బోధన, వసతుల కల్పన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. విద్యావ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయుల నియామకంతోపాటు అర్హులకు ప్రమోషన్లు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను కార్పొరేట్‌లకు దీటుగా నిలబెట్టేందుకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఇటీవల వాంకిడి మండలంలో విద్యార్థిని మరణించడం దురదృష్టకరమని, త్వరలో పూర్తిస్థాయి నివేదికలు వచ్చాక విషయాలు తెలుస్తాయని వివరించారు. విద్యాశాఖ అధికారులు ఉదయ్‌బాబు, శ్రీనివాస్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

వాంకిడి: ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని విద్యార్థులకు వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేయొద్దని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు వెంకటేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వంటగదిని పరిశీలించి ఆహారంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇరుకుగా ఉన్న డైనింగ్ హాల్‌ను తొలగించి కొత్తది నిర్మించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. మధ్యాహ్న భోజనం సమయంలో వెంకటేశ్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థుల అస్వస్థత ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా విద్యాశాఖ ఏడీ గమ్యూనల్, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్లానింగ్ కోఆర్డినేటర్ అబిబ్ అలీ, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, డీటీవో రమాదేవి, జీసీడీవో కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, డీటీ శ్రావణ్, ఎంఈవో శివచరణ్ తదితరులున్నారు.

విద్యార్థిని మరణం దురదృష్టకరం

వాంకిడి: వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని చౌదరి శైలజ మరణం దురదృష్టకరమని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా శనివారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులకు ఆసిఫాబాద్, మంచిర్యాల, హైదరాబాద్‌లలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించినట్లు తెలిపారు. విద్యార్థినుల వైద్యానికి రూ.28 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థిని శైలజకు మంచిర్యాల ఆస్పత్రిలో రూ.3లక్షలు, హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో రూ.10 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. శైలజ అంత్యక్రియల సమయంలోనూ ఐటీడీఏ నుంచి రూ.లక్ష కుటుంబ సభ్యులకు అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.2లక్షల ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు.

నూతన చట్టాలతో వేగంగా కేసుల దర్యాప్తు



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రభాకర్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు మరింత వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా చూస్తామని ఏఎస్పీ ప్రభాకర్‌రావ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో అధికారులు, స్టేషన్ రైటర్లు, సీసీటీఎన్‌ఎస్ రైటర్లు, కోర్టు డ్యూటీ అధికారులు, న్యాయ నిపుణులు, ఎస్సీ, ఎస్టీ కోర్టు ఆదిలాబాద్ పీపీ రమణారెడ్డి, ఆసిఫాబాద్ కోర్టు పీపీ జగన్మోహన్‌రావ్, పోక్సో కోర్టు ఆసిఫాబాద్ పీపీ ప్రసాద్‌తో సమావేశమై నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పులు వచ్చాయని తెలిపారు. వీటి ద్వారా సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశముందని పేర్కొన్నారు. నూతన చట్టాల్లోని అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. అయినప్పటికీ న్యాయ నిపుణులతో అవసరమైనప్పుడు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పీపీ రమణారెడ్డి కొత్త చట్టాల్లో వచ్చిన మార్పులపై అధికారులు, సిబ్బందికి వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎస్‌డీపీ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, సీఐలు స్వామి, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లాలోని ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న దోర్బియాల్

వాంకిడి: వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా జాతీయ రహదారి–363పై మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో నిర్మించిన ఎకో బ్రిడ్జి (పర్యావరణ వంతెన) పై మిగులు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోర్బియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలూసింగ్ మేరులు ఆదేశించారు. శనివారం మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులో నిర్మించిన ఎకో బ్రిడ్జిని సందర్శించారు. ఇటీవల పులి వంతెన పైనుంచి దాటిన ఆనవాళ్లు పరిశీలించారు. వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకే ఈ వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు పులులకు ఎలాంటి హాని కలిగించవద్దని సూచించారు. వంతెనపై మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. దీంతో జంతువులకు మరింత అనుకూలంగా ఉంటుందని తెలిపారు. వారి వెంట జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో వేణుబాబు, ఆసిఫాబాద్ ఎఫ్‌ఆర్వో గోవింద్ చంద్ సర్దార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌ఆర్వో రమాదేవి, ఎన్‌హెచ్ అధికారులు, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

ఈవీఎంల భద్రతకు బందోబస్తు



ఈవీఎంలను పరిశీలిస్తున్న వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు గోదాం వద్ద భారీ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును ఆయన అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సాధారణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. 24 గంటలు సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

'అకాల'ం.. ఆగమాగం

- జిల్లాలో పలు చోట్ల కురిసిన వాన
- కేంద్రాల్లో తడుస్తున్న వరి ధాన్యం
- కాపాడుకునేందుకు రైతుల పాట్లు
- మొక్కలపై నల్లబడిపోతున్న పత్తి
- ఆందోళనకు గురవుతున్న రైతులు



కౌటాల కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు

కౌటాల: ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణ పరిస్థితులు బాగా మారిపోయాయి. శనివారం జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసి ధాన్యం తడిసింది. పంట చేతికి వచ్చే సమయంలో వర్షం కురుస్తుండటంతో ఎలాంటి నష్టాలు చవిచూడాల్సి వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావంతో జిల్లాలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో వర్షం కురిసింది. తుపానుతో పంటలకు నష్టం జరగకుండా రైతులు అప్రమత్తమవుతున్నారు.

మొగులు.. గుబులు

1.20 లక్షల మందికి పైగా రైతులు జిల్లా వ్యాప్తంగా 4.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అత్యధికరంగా 3.26 లక్షల ఎకరాల్లో పత్తి, 62,209 ఎకరాల్లో వరి, 46,096 ఎకరాల్లో కంది వేశారు. జిల్లాలోని 15 మండలాల్లో రైతన్నలు వానాకాలంలో సాగు చేసిన అన్ని పంటలు ప్రస్తుతం చేతికందాయి. ఓ వైపు పత్తితీత పనులు జోరుగా సాగుతుండగా మరో వైపు వరికోతలు కొనసాగుతున్నాయి. అకాల వర్షం కారణంగా పత్తి తడిసి నల్లబడుతోంది. పంట నాణ్యత తగ్గిపోతుందని, పంటకు మద్దతు ధర రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు పూర్తి చేసి కుప్పలు, గడ్డలు వేసిన రైతులు మబ్బుల కారణంగా వాటిపై కవర్లు కప్పుతున్నారు. హార్వెస్టర్లతో వరి కోతలు చేపట్టిన రైతులు కల్లాల్లోని ధాన్యంపై టార్పాలిన్లు కప్పి పొలాల్లో కాపలాగా ఉంటున్నారు. తుపాను కారణంగా భారీ వర్షం కురిస్తే కంది, పత్తి, మిర్చి, వరి పంటలకు నష్టం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

పంటలపై ప్రభావం

తుపాను కారణంగా రెండురోజుల పాటు జిల్లాలో ఆకాశం మేఘావృత్తమై ఉండటంతో పాటు పలు చోట్ల వర్షం కురిసింది. అనావృష్టి కారణంగా ఈసారి వరి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం సహకరిస్తే మరో రెండు వారాల్లో ధాన్యం ఇళ్లకు చేరుతుందని వాపోతున్నారు. కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్నారు. పత్తి పగలి చేన్లలో ఉండటంతో సేకరణకు కూలీలకు అధిక ధరలు చెల్లించి రైతులు పత్తి తీత పనులు చేపడుతున్నారు. మరో వైపు పులి భయంతో పలు చేన్లలో పత్తి తీత పనులు నిలిపివేశారు. దీంతో భారీ వర్షం కురిస్తే పంట నేలపాలవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంపై అధికారులు టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు. పలుచోట్ల లారీల్లో ధాన్యాన్ని తరలిస్తున్నారు. భారీ వర్షం వస్తే కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోతుందని రైతులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు.

రెబ్బెన మండలంలో..

రెబ్బెన: మూడు రోజులుగా అకాల వర్షాలు రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలో వరి, పత్తి పంటలన్నీ చివరి దశలో ఉన్నాయి. యంత్రాల కొరతతో మండలంలో దాదాపు 40శాతం వరి కోతలు మిగిలే ఉన్నాయి. కూలీల కొరతతో వేలాది ఎకరాల్లో పత్తి చేలలోనే ఉండిపోయింది. ఈ సమయంలో మూడురోజులుగా కురుస్తున్న కుండపోత వర్షంతో పత్తి మొక్కల మీదే తడిచి ముద్దయింది. వరి పైరు నేలకొరింది. రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. సేకరణ దశలోని పత్తి తడిచిపోవటంతో నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. మరోవైపు కోతలు పూర్తయి ఆరబెట్టిన ధాన్యం వర్షాలకు తడిసిముద్దవుతోంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అకాల వర్షాలతో వివిధ పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



రెబ్బెన: మండల కేంద్రంలో ధాన్యం కుప్పపై నిలిచిన వాన నీటిని తోడుతున్న కూలీలు

తిర్యాణి మండలంలో..

తిర్యాణి: మండలంలో శనివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. దీంతో గంభీరావుపేట గ్రామానికి చెందిన దాదాపు 30 మంది రైతుల వరి ధాన్యం తడిసిపోయింది.

ధాన్యంపై కవర్లు కప్పినం

"ఇటీవల వరి కోత పూర్తి చేసిన. ఆకాశం మబ్బులు పడుతుండటంతో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పడానికి పరుగులు పెట్టాల్సి వస్తోంది. కూలీల కొరత, పులి భయంతో పత్తి తీత పనులు ఇంకా పూర్తి కాలేదు. వర్షం వస్తే పత్తి నల్లబడుతుంది. కంది పూత దశలో ఉంది. మబ్బుల కారణంగా పూత, కాత రాలిపోతుంది. కౌటాలలో శుక్రవారం కురిసిన వర్షానికి పత్తి పంట తడిసిపోయింది. ఏం చేయాలో తోచడం లేదు."

– బాపురావు, కౌటాల

బాలాజీ ఆలయంలో డిప్యూటీ కమిషనర్ విచారణ



నాయకులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లోగల బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు సందర్శించారు. ఆలయ ఈవో సక్రమంగా ఉండటం లేదని, ఆలయ అభివృద్ధిని పట్టించుకోవటం లేదని, భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించకపోవటం, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చూసుకోకపోవటం లేదని పలువురు భక్తులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టేందుకు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం వివిధ పార్టీల నాయకులతో చర్చించారు. తాత్కాలిక సిబ్బందిని దేవాదాయ శాఖకు తెలియకుండానే నియమిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జాతర ద్వారా భారీగా ఆదాయం సమకూరుతున్న ఆలయం అభివృద్ధికి నోచుకోవటం లేదని ఆరోపించారు. ప్రతీ సోమ, శనివారాలు అన్నదాన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంపై డిప్యూటీ కమిషనర్ ఆరా తీశారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. నాయకులు రమేశ్, సోమశేఖర్, దేవాజీ, సుదర్శన్ గౌడ్, మురళి, అన్నదాన సొసైటీ సభ్యులు గోలెం తిరుపతి, రాపాల శ్రీనివాస్ తదితరులున్నారు.

క్లుప్తంగా

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని భారతీయ వెలమ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అసభ్యపదజాలంతో దూషించడమే కాకుండా వారి అంతుచూస్తామని బెదిరించారన్నారు. వెలమ కులస్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన ఆయనపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అసోసియేషన్ నాయకులు రంగినేని మనిషా, పవన్‌రావు తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ‘అల్లోల’



ఆలయం ముందు స్థానికులతో ఇంద్రకరణ్‌రెడ్డి

జన్నారం: మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జన్నారం మండలం ఇందన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుడు హరికృష్ణ, పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్, నాయకులు మేడారం ప్రదీప్, గోవర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, అమరవేణి నర్సాగౌడ్, గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ విక్రంరావు, అనుముల భాస్కర్, కొప్పుల శ్రీధర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సీవోఈ విద్యార్థి



నిశాంత్‌ను అభినందిస్తున్న ఎంఈవో

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) గురుకుల విద్యాలయం పదో తరగతి విద్యార్థి ఎం.నిశాంత్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఎంఈవో పోచయ్య, ప్రిన్సిపాల్ శ్రీధర్ శనివారం ఆయన్ను అభినందించారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జోనల్‌స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిశాంత్ అండర్–17 విభాగంలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.విజయసాగర్, పీఈటీలు అల్లూరి వామన్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయ్ మర్చంట్ టోర్నమెంట్‌కు ఎంపిక



కశ్యప్

ఆదిలాబాద్: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించే విజయ్ మర్చంట్ అండర్–16 టోర్నమెంట్‌కు జిల్లా కేంద్రానికి చెందిన కశ్యప్ ఎంపికయ్యాడు. మహారాష్ట్రలోని విదర్భ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. విజయవాడలో కర్ణాటక జట్టుతో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నట్లు కోచ్ జయేంద్ర పటాస్కర్ తెలిపారు. ఇటీవల ఇండియన్ జూనియర్స్ అండర్–16 టోర్నమెంట్‌లో 15 వికెట్లు తీసి బెస్ట్‌బౌలర్‌గా నిలిచాడని పేర్కొన్నారు.

ఇక మూడో యూనిట్..

- జీహెచ్‌ఈఎల్‌కే మళ్లీ నిర్మాణ పనులు
- తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెర
- నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు
- రూ.9500 కోట్లతో 800 మెగావాట్ల ప్లాంటు
- త్వరలో పనుల ప్రారంభోత్సవానికి సన్నాహాలు



జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఇదే

జైపూర్: ఎట్టకేలకు మూడో యూనిట్ (800 మెగావాట్లు) థర్మల్ పవర్ ప్లాంటుకు మోక్షం కలగనుంది. రూ.9500 కోట్లతో నిర్మించనుండగా, తొమ్మిదేళ్ల నిరీక్షణ నిరీక్షణకు తెరపడనుంది. 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను విస్తరిస్తూ మూడో యూనిట్ నిర్మాణానికి సంస్థ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2010లో రెండు యూనిట్లు (600+600) మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటు పనులు ప్రారంభించారు. 2017లో పూర్తిచేసుకుని ఈ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించుకుని రాష్ట్రానికి నిరంతరం విద్యుత్ కాంతులు పంచుతోంది. రెండోదశలో మూడో యూనిట్ నిర్మాణ పనులకు గత సీఎం కేసీఆర్ 2015లో శంకుస్థాపన చేశారు. టెండర్లను పిలవడానికే ఏళ్లు పట్టగా, గతేడాది తొలిసారి వేసిన టెండర్లను రద్దు చేయగా, ఈ ఏడాది మళ్లీ టెండర్లు పిలిచారు. మళ్లీ బీహెచ్ఈఎల్ కంపెనీ పాల్గొంది. సీఎండీ బలరాం నేతృత్వంలో ఢిల్లీ వేదికగా నాలుగైదు సార్లు ఇప్పటికే టెండర్ రేట్ కోడ్ల తగ్గుదలపై సంప్రదింపులు చేపట్టింది. బీహెచ్‌ఈఎల్, సింగరేణి మధ్యన ఒప్పందం ఒక్క దశకు చేరడంతో ఇక ప్లాంటు పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఒక పక్క థర్మల్ పవర్ ప్లాంటు మరోపక్క సోలార్ ప్లాంట్ల నిర్మాణంతో సింగరేణి విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలవనుంది. సీఎండీ బలరాం.. ఎస్టీపీపీపై ప్రధానంగా దృష్టిసారించారు. కొత్త ప్లాంట్ నిర్మాణంపై వేగవంతంగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నట్లుగా తెలుస్తోంది.

విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు, నీరు

బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంటు కావడం విద్యుత్ ఉత్పత్తికి ప్రధానంగా బొగ్గు, నీరు అవసరం. ఇప్పటికే సింగరేణి సంస్థ అవసరానికి మించి ఇక్కడ భూముల సేకరణకు షెట్‌పల్లి గోదావరినది నుంచి ఒక టీఎంసీ నీరు, కోటపల్లి మండలం దేవులవాడ నుంచి 2 టీఎంసీల నీరు తరలింపునకు పైపులైన్ నిర్మించి పవర్ ప్లాంటుకు తరలిస్తున్నారు. ఇక సంస్థకు చెందిన భూగర్భ గనులు, ఓసీపీ ఉండడం శ్రీరాంపూర్ సీహెచ్‌పీ నుంచి ఎస్టీపీపీ బొగ్గు రవాణా చేయడానికి పర్మినెంట్‌గా రైల్వేట్రాక్‌లైన్ నిర్మించుకుని తరలిస్తున్నారు.

నిరుద్యోగుల ఎదురుచూపు

కొత్త ప్లాంటు నిర్మాణంపై స్థానిక నిరుద్యోగులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. రెండు యూనిట్లలో ఇప్పటికే భూనిర్వాసితులు సుమారు వెయ్యిమంది ఆయా విభాగాల్లో పని చేస్తుండగా పలు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు 500 మందికి పైగా ఉన్నారు. 800 మెగావాట్ల ప్లాంట్‌లో సుమారు 2 వేలకు పైగా మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ప్లాంటు నిర్మాణంతో వేలాది మందికి ప్రత్యక్షంగా వందలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ



కొత్తగా ప్లాంటు నిర్మించనున్న ప్రాంతం

800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు సమాచారం. గతంలో ఎస్టీపీపీలో పలు ప్రారంభోత్సవాలకు రావల్సిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పర్యటన చివరి క్షణంలో రద్దయింది. స్థానిక ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సీఎం రేవంత్‌రెడ్డిని కొత్త ప్లాంటు ప్రారంభోత్సవానికి తీసుకువస్తారని నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

రైస్‌మిల్లులో మోసం

- 1.5 క్వింటాల్ బియ్యం తరుగు
- ఆ బియ్యం డబ్బులు రైతుకు చెల్లిస్తానని నిర్వాహకుడు అంగీకారం



నిర్వాహకుడితో మాట్లాడుతున్న తహసీల్దార్

మందమర్రిరూరల్: మందమర్రి మండలం ఆదిల్‌పేట్ సమీపంలోని ఓ రైస్‌మిల్లులో రైతుకు మోసం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని రైతు వరిధాన్యంతో మిల్లుకు వెళ్లి బియ్యం పట్టించుకున్నాడు. సరిపడా బియ్యం రాకపోయేసరికి అనుమానంతో నిర్వాహకుడిని నిలదీయగా బుకాయించాడు. ఈవిషయమై తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన రైస్‌మిల్లు వద్దకు చేరుకున్నారు. మిల్లులో ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల తవుడులో బియ్యం కలిశాయని నిర్వాహకుడు అంగీకరించాడు. తరుగైన 1.5 క్వింటాల్ బియ్యం డబ్బులను రైతుకు ఇస్తానని నిర్వాహకుడు అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది. మిల్లును ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని మరోసారి ఇలాంటి ఘటన ఎదురైతే జరిమానా విధిస్తామని తహసీల్దార్ నిర్వాహకుడిని హెచ్చరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన

బాసర: ప్రభుత్వ ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవస్థానం అధికారుల వైదిక బృందం ఆధ్వర్యంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి కళాకారులు, చిన్నారుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఆలయ ఈవో విజయ రామారావు చిన్నారులకు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు నవీన్‌శర్మ, భక్తులు ఉన్నారు.

పారిశ్రామిక సంబంధాలు మెరుగుపర్చుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పారిశ్రామిక సంబంధాలు మరింత మెరుగుపడడానికి ఒకరికొకరు సహకరించుకోవాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ సూచించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏఐటీయూసీ, యాజమాన్యం మధ్య శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. త్వరలో జరిగే స్ట్రక్చర్ సమావేశం నేపథ్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య,ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి బాజీసైదా పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే కార్మికుల సమస్యల పరిష్కారం

- యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



కాసిపేట 1ఇంక్‌లైన్ గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: ఏఐటీయూసీతో కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట–1 ఇంక్‌లైన్ గనిపై శనివారం ఏర్పాటు చేసిన గేటుమీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గత ఐదారేళ్లుగా స్ట్రక్చర్ మీటింగ్‌లు జరగక కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం, రాజకీయ జోక్యంతో అనేక సమస్యలు అలాగే ఉన్నాయని తెలిపారు. ఏఐటీయూసీ గెలిచిన తర్వాత డైరెక్టర్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించామన్నారు. డిస్మిస్ అయిన జేఎంటీ ఉద్యోగులకు అవకాశం కల్పించడం, మైనింగ్‌స్టాఫ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్లకు అండర్‌గ్రౌండ్ అన్‌ఫిట్ అయితే సూటెబుల్ జాబ్ ఇచ్చేందుకు ఒప్పందం జరిగిందని తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, సభాధ్యక్షుడు నాగేశ్వరరావు, పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, చిప్పరి శ్రీహరి, సెగ్గెం శంకర్, రంజిత్ కుమార్, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి, అసెంబ్లీ ఎన్నికల ముందు గెలిచి అధికారంలో ఉన్న కార్మిక సంఘం, ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (టీజీఎల్‌బీకేఎస్)రాష్ట్ర కార్యదర్శి ఐ.కృష్ణ పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నోఏళ్లుగా పెండింగ్ ఉన్న క్యాడర్ స్కీమ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. మారుపేర్లతో పనిచేసే వారి పేర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అలవెన్స్‌లపై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. సమావేశంలో చాంద్‌పాషా, నరేశ్, ఎండీ జాఫర్, మల్లేశ్, అశోక్, కిష్టన్న, పి.శ్రీనివాస్, సంతోష్, కొమురయ్య, డి.బ్రహ్మానందం పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి



బాధిత రైతుకు నగదు అందిస్తున్న అటవీ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం గంటలగూడెం అటవీ ప్రాంతంలో శనివారం చిరుత దాడిలో ఆవు మృతి చెందింది. బాబాపూర్‌కు చెందిన రైతు బానోత్ రాములుకు చెందిన పశువులు మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా ఆవుపై దాడి చేసి హతమార్చింది. సమాచారం అందుకున్న జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, సెక్షన్ అధికారులు మహేందర్, చంద్రకాంత్, బీట్ అధికారులు సాదిక్, స్వప్న, మారుతి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాడి చేసింది చిరుత అని తేల్చారు. బాధితుడికి అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.5 వేలు అందించారు. పులి సంచరిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని అధికారులు పేర్కొన్నారు.

‘కవ్వాల్’కు పర్యాటకుల తాకిడి

- వారమంతా సందర్శకుల రద్దీ
- అడవుల్లో పర్యటిస్తున్న ప్రముఖులు



సఫారీ ద్వారా అడవుల్లోకి వెళ్తున్న పర్యాటకులు

జన్నారం: సఫారీ ప్రయాణం ప్రారంభంతో కవ్వాల్ టైగర్‌జోన్ సందర్శనకు పర్యాటకుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అడవిలో వన్యప్రాణులు, పచ్చని అడవులను చూసి మురిసిపోతున్నారు. పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం మధ్య హాయిగా గడుపుతున్నారు. సఫారీ ప్రయాణం కోసం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వస్తుండడంతో ప్రతీ రోజు మూడుసార్లు సఫారీ వెళ్లేందుకు అటవీ శాఖ అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం వారాంతపు రోజుల్లోనే కాకుండా మిగతా రోజుల్లోనూ భారీగా వస్తున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు పరిసర జిల్లాల నుంచి పర్యాటకులు స్థానిక హరిత రిసార్ట్‌లో బస చేసి ఉదయాన్నే అడవి సందర్శనకు వెళ్తున్నారు. గత ఏడాది కాలంగా కడెం హరిత రిసార్టు సరిగా నడవకపోవడంతో జన్నారం హరిత రిసార్ట్‌కు పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. కవ్వాల్ సందర్శనకు వచ్చే వారితో హరిత రిసార్ట్ గదులు నిండిపోతున్నాయి. గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు సుమారు 4,500 మంది పర్యాటకులు రాగా.. ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 1400మందికి పైగా ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకున్నట్లు రిసార్ట్ మేనేజర్ వీరేందర్ తెలిపారు. టూరిజం శాఖతోపాటు అటవీశాఖ ఏర్పాటు చేసిన సఫారీల ద్వారా కూడా పర్యాటకులు సఫారీ ప్రయాణం చేస్తున్నారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి అడవిలో పర్యటనకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రముఖుల పర్యటన

జన్నారం అడవుల్లో ప్రముఖులు పర్యటిస్తున్నారు. ఉదయాన్నే అడవులకు వెళ్లి వన్యప్రాణులను చూసి మురిసిపోతున్నారు. వాచ్‌టవర్లు, నీటికుంటలు, గడ్డిమైదానాలు పరిశీలిస్తున్నారు. అక్టోబర్ 2న ప్రభుత్వ అదనపు కార్యదర్శి అశోక్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి పర్యటించారు. అక్టోబర్ 16న కరీంనగర్‌కు చెందిన విద్యార్థులు, 24న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, లక్సెట్టిపేట కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ కుటుంబ సమేతంగా అడవుల్లో పర్యటిచారు.

పీహెచ్‌డీ విద్యార్థుల పర్యటన



వెల్‌కం కవ్వాల్ బోర్డు వద్ద విద్యార్థులు

జన్నారం: హైదరాబాద్‌కు చెందిన సీసీఎంబీ బయాలజీ కళాశాల పీహెచ్‌డీ విద్యార్థులు శనివారం కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించారు. శుక్రవారం రాత్రికి జన్నారానికి చేరుకున్న విద్యార్థులు రాత్రి హరిత రిసార్టులో బస చేసి శనివారం ఉదయం అడవిలోకి వెళ్లారు. పరిశోధనలో భాగంగా అడవుల్లో పర్యటించినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. సఫారీ ద్వారా గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్ కుంట, మల్యాల వాచ్‌టవర్ వరకు ప్రయాణించి అడవులను పరిశీలించారు. ఇక్కడ అడవుల రక్షణ, వన్యప్రాణులకు కల్పిస్తున్న సౌకర్యాలను రేంజ్ అధికారి సుష్మారావు తెలియజేశారు.

నెల రోజులుగా..



అక్టోబర్‌లో సఫారీ ప్రయాణం ప్రారంభమైంది. నవంబర్‌లో పర్యాటకుల సంఖ్య పెరిగింది. వారమంతా పర్యాటకులతో గదులు నిండుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– వీరేందర్, హరిత రిసార్ట్ మేనేజర్

కాశీ, అయోధ్యలో నృత్యప్రదర్శన



సర్టిఫికెట్లతో విద్యార్థులు

బెల్లంపల్లి: ఈనెల 4న కాశీలోని అస్సీఘాట్‌లో సనాతన సాంస్కృతిక సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో బెల్లంపల్లికి చెందిన నటరాజ డ్యాన్స్ అకాడమీ నృత్య విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కాశీ విశ్వేశ్వరుని నృత్య నీరాజనంలో హనుశ్రీ, శ్రీనికరాజ్, శ్రీఆశ్వీ, శ్రీనిక, షణ్ముక ప్రియ, అక్షయని, లక్ష్మీవర్షిణి, సాయి మనుజ్ఞ, శ్రీవర్షిణి, హన్విక, వైష్ణవి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. అదేవిధంగా అయోధ్యలో శనివారం సీతారాములకు నృత్యనీరాజనం చేశారు. రామాయణ నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అనంతరం వీరికి బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బెల్లంపల్లి సివిల్ కోర్టు న్యాయమూర్తి ముకేశ్, మాలోతు నవీన్, నృత్యగురువు అర్చన, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోథ్ ఎస్టీ బాలుర హాస్టల్ తనిఖీ



వంటగదిని పరిశీలిస్తున్న డీడీ వసంత్‌రావ్

బోథ్: మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ వసంత్‌రావ్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. వ్యర్థపదార్థాలు ఉండటం, నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వండిన భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. అలాగే విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉండడంపై మండిపడ్డారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. వార్డెన్ జైతు, సీఆర్టీ విజయ్, సిబ్బంది ఉన్నారు.

గోదావరి నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



శివానంద్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

బాసర: బాసర గోదావరి నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తానూరు మండల కేంద్రానికి చెందిన శివానంద్ (37) గత నాలుగేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. తీవ్ర మనస్తాపంతో శనివారం బాసర గోదావరి వద్దకు చేరుకున్నాడు. బ్రిడ్జిపై చెప్పులు వదిలి..నదిలో దూకాడు. గంగపుత్రులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంగపుత్రులు, గజఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి అన్న మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి..

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి సమీపంలో శనివారం రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. హమాలివాడకు చెందిన కనవేణి శ్రీనివాస్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు భార్య పుష్పలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న నయం కాలేదని తీవ్ర మనస్తాపం చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధురాలు మృతి



అబ్బాస్ బేగం మృతదేహం

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలుఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కె.సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం..కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూకాలనీకి చెందిన అబ్బాస్ బేగం (80) గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా భిక్షాటన చేస్తూ తిరుగుతుండేది. ఈక్రమంలో శనివారం సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకుంది. రైలు పట్టాలపై నుంచి వెళ్తుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతిచెందింది. మృతదేహానికి పంచనామా చేసి సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆమె కూతురు ముంతాజ్ బేగంకు మృతదేహాన్ని అప్పగించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం ..జిల్లా కేంద్రంలోని ఆసరా కాలనీకి చెందిన ఇమాముద్దీన్ (60) శుక్రవారం రాత్రి చిట్యాల వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఇమాముద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ..



సుమలత (ఫైల్)

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందింది. ఎస్సై సౌమ్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..సుమలత (35) శనివారం ఉదయం ఇంట్లో బట్టలు ఉతికి ఆరేస్తుండగా ప్రమాద వశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతిచెందింది. ఘటనాస్థలిని ఎస్సై సందర్శించారు. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్ల నుంచి డీజిల్ చోరీ

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో రెండు ట్రాక్టర్ల నుంచి గుర్తుతెలియని దుండగులు డీజిల్ చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..మ్యాదరి సుధాకర్, ముస్కు సురేశ్‌లకు చెందిన ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ముద్దం రాజారెడ్డి ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశారు. శనివారం ట్రాక్టర్లను పరిశీలించగా ఇంజిన్ల నుంచి సుమారు 100 లీటర్ల డీజిల్‌ను దుండగులు దొంగిలించారని గుర్తించారు. డీజిల్ విలువ సుమారు రూ.9500 ఉంటుందని యజమానులు తెలిపారు. మ్యాదరి సుధాకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.